కథ

# కాలచక్రం

పోలాప్రగడ రాజ్యలక్ష్మి

కాలచక్రం గిర, గిరా, తిరుగుతోంది. వద్దు అన్నా వినదు, ఆగదు.

ముసలి తనం వచ్చి మీదపడుతోంది. సిరులున్నా లేకున్నా మనోబలంతో నెట్టుకువచ్చాను, ఇన్నాళ్ళూను. సుందరమ్మ వంట ఇంట్లో పనులు చేసుకుంటూ, తనలో తను అనుకున్నట్లు పైకి కూడా అంది.

ఎనిమిది ఏళ్ళ మనవడు వచ్చి, 'కాలచక్రం అంటే ఏమిటి? బామ్మా' అన్నాడు.

'నీకు స్కూలుకి టైము అయింది, వెళ్ళు' అని, కొడుకుని కేకలేసింది. సునంద. "నా టిఫెన్ బాక్సు ఇలా పట్రా సునందా!" అని కేక వేసాడు హాల్లోంచి వెంకట్రావ్, బూట్లు పాలీష్ చేసుకుంటూను. "మీరు వెళ్ళి తెచ్చుకోండి. నేను హేండ్ బేగ్ సర్దుకుంటున్నాను" అంది సునంద. పరంధామయ్య, చదువుతూన్న పేపరు అక్కడ పెట్టి, కుర్చీలోంచి లేచి వెళ్ళి టిఫెన్ బాక్స్ పట్టుకువచ్చి కొడుక్కి ఇచ్చాడు. టిఫెన్ బాక్సు తీసుకుంటూ 'మీకెందుకు నాన్నా ఈ పనులు,' అంటూ తీసుకున్నాడు వెంకట్రావ్!

'నేను, రెడీ అయ్యాను, బస్సు స్టాపుదాకా, స్కూటరు మీద దిగపెడితే, ఆఫీసు టైముకి అందుకో గలను.' అంది సునంద, హుషారుగా చూస్తూ.

ఇంతలోకీ వీధిలోంచి పాలవాడి కేక సైకిలు బెల్లు గణ గణా మ్రోగిస్తూను. "వీడు సరిగ్గా ఇదే టైముకి వస్తాడు. పాలు అంటూనూ" విసుగ్గా చూసి, 'మావయ్యా గిన్నెతెచ్చి పాలు పోయించుకోండి కొంచెం' అంది సునంద. పరంధామయ్యకి ఆ మాటలకి కోడలి మీద కోపం వచ్చి తారాజువ్వలా లేచాడు, కుర్చీలోంచి.

"పెద్ద వాళ్లంటే గౌరవం పోయింది. నేను మీ కంటే పెద్ద ఉద్యోగమే చేసాను," అంటూ కోడల్ని కోపంగా చూసాడు పరంధామయ్య.

'ఆలస్యంగా వెడితే, ఆఫీసులో మాట పడవల్సి వస్తుంది. అని," విస విసా వీధిలోకి వెళ్ళిపోయింది సునంద.

"విన్నావుట్రా నా మాటకి ఎలా సమాధానం చెప్పిందో" అంటూ కొడుకుకేసి చూసాడు పరంధామయ్య. వంటింటిలోంచి, పాలకి గిన్నె తీసుకు వస్తూ "నేను వస్తున్నానర్రా ఏమిటా కేకలు, ఇరుగూ పొరుగూ వింటారు." అంది సుందరమ్మ "ఈ ఇంట్లో ఎవరికి ఎప్పుడు కోపమొస్తుందో నన్న భయమే నాకు. ఆఫీసులో కూడా, పై ఆఫీసరు నాకింద వర్కు చేసే గుమస్తాలూను. నాకూ ఓర్పు పోతోంది." అని వెంకట్రావు తల్లి కేసీ, తండ్రికేసీ చూసి, ఆఫీసుకి స్కూటరు మీద వెళ్ళి పోయాడు. పాలు పోయించుకుని, పాలగిన్నె పట్టుకుని వచ్చి కుర్చీలో కూర్చుంది సుందరమ్మ నిట్టూర్పు విడుస్తూనే. పేపరు ముఖానికి అడ్డం ఉన్నా, భర్త మనోభావాలు చదవగలదు సుందరమ్మ, అందుకే అంది, "కోడలు కూడా మన పిల్లలాంటిదే కదా? అంత కోపం ఎందుకు?" అని.

పరంధామయ్య. "ఊ..." అన్నాడు.

"అదా చిన్న పిల్ల, ఆఫీసుకు వెళ్ళే కంగారులో ఉంది."

"అయితేముటుకూ నన్ను ఈ వయస్సులో పాలు పోయించుకోండి అంటుందా?' కోపంతో అరిచి పేపరు పక్కన పడేసాడు విసుగ్గా మొహం పెట్టి భార్య కేసి చూస్తూ.

"నాకు మాత్రం ఓపిక ఉందా ఉదయం అయిదు గంటలకే లేచి చేస్తున్నానంటేను."

'బాధ్యతలు వద్దు! అనుకుంటే, హక్కులు కూడా పోతాయండీ! వాళ్ళే వండుకుంటారు మనకు పెడతారు కాని ఓపిక ఉన్నంత వరకూ చేస్తే రేపు ముసలి తనంలో మనల్ని ఆదుకుంటారు" అంది సుందరమ్మ.

"నేను మాత్రం చెయ్యటంలేదూ? కరెంటు బిల్లు కడుతున్నాను, సరుకులు తెస్తున్నాను" అన్నాడు.

"ఇలాంటి చిన్న చిన్న విషయాల్ని రాద్ధాంతం చేసుకుంటే ఎలా చెప్పండి. మీ తమ్ముడికి, ఈ వయసులో పిల్లలు లేక ఎంత బాధపడుతున్నారో చూడండి" అంది.

"ఇప్పుడు ఆ సంగతి ఎందుకూ" విసుక్కున్నాడు.

"రేపు అమ్మాయి దగ్గిరకి బెజవాడ వెడదాం వస్తావా రావా?" అన్నాడు.

"రేపే వెడితే మనం ఏదో కోపం వచ్చి వెళ్ళామనుకుంటారు. నాలుగు రోజులు పోయాకే వెళదాం" అంది సుందరమ్మ.

"ఎలాగైనా నాకంటే పిల్లల మీదే ప్రేమ నీకు వస్తేరా? లేదా వాళ్ళ కేరాఫ్‌లోనే ఉండు." అన్నాడు పరంధామయ్య.

'పగలల్లా ఇద్దరూ కష్టపడి వస్తారనే జాలి, అంతే" అంది కాని,

పరంధామయ్య మాటలకి, పౌరుషం వచ్చింది, గుండె బరువై నిట్టూర్చిందీ, అప్పటి వరకూ చేతిలో ఉన్న పాల గిన్నె మరీ బరువుగా అనిపించింది. ముఖం అంతా ఎర్రబడింది. నుదుటి కుంకుమ బొట్టులాగా. మళ్ళీ మాటకి మాట సమాధానం చెపితే, వాదోపవాదాలు వస్తాయి. ఇటువంటి పరిస్థితిలో మౌనంగా ఉండడం సుందరమ్మకి అలవాటేను. లేచి వంట ఇంటివైపుకి వెళ్ళిపోయింది పాలగిన్నెతో.

ఆరాత్రి ఎవరితో ఎవరూ సరిగా మాట్లాడుకో లేదు. ఎవరి పనుల్లో వారున్నారు. రంగడికి ఏం తోచక, "తాతా భాగవతంలో పద్యాలు చెప్తావా?" అంటూ వెళ్ళాడు. అయిష్టంగా అటు చూసి "ఇవేళ చెప్పనురా" అన్నాడు విసుగ్గా ముఖం పెట్టి. రంగడు తండ్రిని పలకరిద్దామనుకుని ఆఫీస్ కాగితాలు పరిశీలిస్తున్నప్పుడు పలకరించడానికి భయపడి, తల్లి దగ్గిరకి వెళ్ళాడు. మంచం మీద అటు తిరిగి పడుకుంది సునంద. "నాకు ఆకల్లేదు మీరంతా తినండి" అని చెప్పి, రోజుల్లా అత్తగారికి వంటింటిలో పనిసాయం కూడా చేయలేదు. రంగడు, "అమ్మా అమ్మా" అన్నాడు. మెలకువగా ఉండీ పలకటం లేదని రంగడికి అర్థం అయి మెల్లగా అక్కడి నుంచి సుందరమ్మ దగ్గరకు వెళ్ళి. 'బామ్మా! పొద్దున్న కాల చక్రం అన్నావే ఆ కథ చెప్పవూ?" అన్నాడు.

"ఏం చెప్పనురా. నాయనా,' అంది వేదాంతిలా అష్టపదులు పాడుకుంటూ మరునాటికి కూర తరిగి ప్లాస్టిక్ సంచిలోకి సర్ది, ఫ్రిజ్‌లో భద్రపరుస్తూను. "కాల చక్రం అంటే, భూమి తన చుట్టూ తను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరుగుతోంది. అల్లాగే, తల్లితండ్రుల చుట్టూ పిల్లలు తిరుగుతారు. పిల్లల చుట్టూ తల్లి తండ్రులు తిరుగుతారు. తర తరాలుగా ఈ కాలచక్రం ఇలా తిరుగుతోంది,' అంది సుందరమ్మ.

'బామ్మా కాలచక్రం కథ ఇంకా ఉందా? నాకు నిద్ర వస్తోంది. రేపు చెబుదువుగానిలే' అన్నాడు రంగడు. అప్పటి దాకా అంతా విన్న వెంకట్రావు 'నీవేదాంతం వాడికి ఏమి అర్థం అవుతుందే అమ్మా' అన్నాడు కొంచెం విసుగ్గా.

ఇంతలోనే, పరంధామయ్య, 'ఒరేయి అబ్బాయీ, నేనూ, మీ అమ్మా మీ అక్క దగ్గిరకి వెళతాంరా' అన్నాడు. 'ఇప్పుడెందుకు, ఏపండగలకో, వెళ్ళవచ్చును, అప్పుడు రంగడికి స్కూలుకి సెలవలు ఇస్తారు. వాణ్ణి కూడా తీసుకువెళ్ళవచ్చును" అన్నాడు వెంకట్రావు.

'వెళ్ళాలనుకున్నాను వెడుతున్నాను' _

'సరే మీ ఇష్టం,' అని వెంకట్రావు గదిలోకి వెళ్ళి పడుకున్నాడు.

సునంద, ఇంకా పడుకున్నట్లు లేదు అనునయంగా చెక్కిలి నిమరబోయాడు. కోపంగా చేతిని తప్పించింది, కళ్ళు తుడుచుకుంటూ లేచి మంచం మీద కూచుంటూ, 'పొద్దున్న మీ నాన్నగారికి అంత కోపం వచ్చింది నేనేం తప్పు మాట అన్నానని' అంది.

"ఏదో పెద్దవారు కోపం వచ్చింది. నువ్వు కూడా సమాధానం చెప్పావు కదా?' అన్నాడు, 'మరి చెప్పకపోతే ఎలాగా, నా. అవస్థ నాది. అయినా మీర్ఘు ఎలా చెపితే అలా చేస్తున్నాను కదా మన పెళ్ళి అయినప్పటి నుంచీనూ.

"నువ్వు కూడా ఉద్యోగం చెయ్యాలి నా ఒక్కడి జీతం చాలదు అన్నారు అలాగే చేస్తున్నాను. మనకి ఒక్క పిల్లవాడు చాలు అన్నారు. అల్లాగే అన్నానుకదా? నా తల్లి తండ్రులకు నేను ఒక్కణ్ణే కొడుకుని మన దగ్గరే ఉంటారు వాళ్ళు అన్నారు. సరేనన్నాను కదా? చిన్న మాట పాలు పోయించుకోండి మావయ్యా అన్నానని అంత కోపం వచ్చిందే," అంది సునంద బాధపడుతూనే.

"ఏం కోపం రాలేదు కాని, పొద్దు పోయింది పడుకో" అన్నాడు వెంకట్రావు ఓదార్పు గొంతుకతో.

"కోపం రాకపోతే రేపు మీ అక్కగారింటికి వెళతామని ఎందుకన్నారు?"

'ఏదో ఒకే చోట ఉంటే తోచదు ఈ వయసులో, మార్పు కోసం వెళ్ళడం వాళ్ళకి అలవాటే కదా?

"ఇంటి పక్కనే దేవాలయం, రంగడితో కబుర్లు లేక అక్కడ తోచదు. వెళ్ళినా వెంటనే వస్తారు!" అన్నాడు. వెంకట్రావు.

'పోనీ వెళ్ళనివ్వండి, పనంటారా? కొంచెం పెందరాళే లేచి చేస్తాను. మరి, మీ అమ్మగారంత రుచిగా వండలేకపోవచ్చును,' అంటూ మాటలు సాగతీస్తూ అంది సునంద ఉడుకుబోతుతనంతో.

అనుకున్న ప్రకారం, పరంధామయ్యా సుందరమ్మా ఊరికి వెళ్ళారు. వెళ్ళిన పది రోజులకి ఉత్తరం వచ్చింది. "ఇక్కడ మన బంధువులు కాశీ వెళుతున్నారు. మేము కూడా వెళుతున్నాము, నెల రోజులు దాకా పడుతుంది మేము రావడానికి' అని, పరంధామయ్య దగ్గర్నుంచి. రోజులు గడుస్తున్నాయి. కొన్ని ఇబ్బందులు కూడా ఎదురౌతున్నాయి, వెంకట్రావుకీ, సునందకీను.

'తాతా, బామ్మా ఎప్పుడు వస్తారు?' అని తరుచు అడుగుతున్నాడు రంగడు.

సునంద ఆఫీసు నుంచి అలసి వచ్చేటప్పటికి అత్తగారు కోడలుకి ఆప్యాయంగా అన్నం పెట్టేది. ఇప్పుడు సునందకి ఆ సౌఖ్యం లేదు. ఇంట్లోనూ, బయట ఆఫీసులోనూ పనులుతో సతమౌతోంది. పైగా రంగడు అన్నం దగ్గిర రోజూ ఏదో పేచి పెట్టి అన్నం సరిగ్గా తినడం లేదు. ఇది ఏం బాగా లేదు! అది నాకు వద్దు తీసెయ్యి అంటూంటాడు.

సునంద పని హడావిడిలో ఉండి, "తినకపోతే మానెయ్యి. మీ బామ్మ లాగా బతిమాలి పెట్టేందుకు, నాకు ఓపికలేదు" అంటూండేది.

వెంకట్రావు సునందకి కూరతరిగి, సాయం చెయ్యాలని, వచ్చి చెయ్యి కోసుకున్నాడు. పైగా ఇంకొక కొత్త పని వచ్చింది సునందకి. మొగుడికి అన్నం తినిపించడం.

ఓ రోజుని వెంకట్రావు దగ్గిరకి వచ్చి, "ఈ పాల వాడితో పడలేకుండా ఉన్నాను. ఒక్క రోజు ఓ టైముకీ, మరో రోజు మరో టైముకి వస్తాడు ఆ పక్క వాళ్ళింట్లో పోసి పోతాడు. సాయంకాలం వచ్చాక కాస్తే విరిగి తగులడుతున్నాయి" అంది. సునందకేసి తీక్షణంగా చూసాడు. ఇంట్లోనూ, బయట పనులతో, నలిగిపోయి. నీరసంగా ఉంది అనుకున్నాడు.

తండ్రి కూర్చునే కుర్చీ చిన్న బోయి ఉంది. వంట ఇంటి వైపు చూశాడు. తల్లి పాడే గోవింద నామాలు వినిపించక, వెలితిగా ఉంది మనసుకి. "మా అమ్మనీ నాన్ననీ వెంటనే రమ్మని ఉత్తరం రాస్తాను ఉండు.' అని కార్డు తీసి, రాసి పోష్టు చేసాడు వెంకట్రావు. ఈ మధ్యన గుబులు గూడు కట్టుకున్న, ఆ ఇంట్లో, పరంధామయ్యా, సుందరమ్మా రావడంతో, కబుర్లతో కలకల లాడింది.

అత్తగార్నీ మావగార్నీ ఆప్యాయంగా పలకరించింది సునంద నవ్వుతూను. రంగడు సంతోషంగా, "వచ్చావా? తాతా" అంటూ ఎదురు వెళ్ళి, "బామ్మా...." అంటూ పలకరించాడు.

వెంకట్రావు తల్లినీ, తండ్రినీ ఆప్యాయంగా చూస్తూ "ప్రయాణం బాగా జరిగిందా? నేను రాసిన ఉత్తరం అందిందా?" అని పలకరించాడు.

పరంధామయ్య నవ్వుతూ, 'నా ఇంటికి నన్ను రమ్మని రాయాలి ఏమిట్రా. మీ అమ్మ మిమ్మల్ని తలచుకోని సమయం లేదు. పిల్లలు ఏం అవస్థపడుతున్నారో మనం లేక అని.." అన్నాడు.

'ఇలా చిక్కిపోయారేమిట్రా. ఉండండి నా చేత్తో రుచిగా వండి పెడతాను.' అంది సుందరమ్మ.

'భోజనానికి మేము రెడీ' అన్నాడు వెంకట్రావు. అష్ట పదులు పాడుకుంటూ, పనులు చేసుకోసాగింది సుందరమ్మ.

పరంధామయ్య మనవేడికి భాగవతంలో పద్యాలు చెపుతూంటే గదిలోంచి, వెంకట్రావు సునందా కబుర్లూ నవ్వులూ వినిపిస్తున్నాయి.

కాలచక్రం గిర గిరా తిరుగుతోంది, తల్లి తండ్రుల చుట్టూ పిల్లలూ, పిల్లల చుట్టూ తల్లితండ్రులూ తిరుగుతున్నట్లు తరతరాలుగా, ఈ కాలచక్రం ఇలా తిరుగుతూనే ఉంది, భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతున్నట్లుగా... ✪



Vemakoti Seeta Rama Sastry
WRITER AP-EB JAD (Retd)
RAMAKRISHNA NAGAR
Plot No. 24
SRIKAKULAM